www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 18 డిసెంబర్ 2025

5

ఏలూరు






అమరావతిలో రెండు రోజులపాటు జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సదస్సులో తొలిరోజు బుధవారం సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

చలి పంజా..!

- తగ్గిన ఉష్ణోగ్రతలు
- వణికిస్తున్న చలిగాలులు
- రానున్న రోజుల్లో మరింత తీవ్రం



ఆచంటలో దట్టంగా పొగ మంచు



చలి కాగుతున్న యువకులు

ప్రజాశక్తి - ఆచంట

జిల్లాలో నాలుగైదు రోజులుగా చలి గాలుల తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు కూడా తగ్గాయి. ప్రస్తుతం జిల్లాలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. జిల్లాపై చలి పులి పంజా విసురుతోంది. ఉదయం ఎనిమిది గంటలు దాటే వరకూ ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు పొగ మంచు రాత్రి పది గంటలు తర్వాత దట్టంగా కమ్ముకుంటుంది. మారిన వాతావరణంతో ప్రజలు చలికి గజగజ వణికిపోతున్నారు. సాయంత్రం ఐదారు గంటల తర్వాత నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకూ చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది చలి తీవ్రత ఎక్కువగా ఉంది. గతేడాది ఇదే సమయానికి అంతగా చలి అన్పించలేదు. గత వారం రోజులుగా ఉదయం ఎండ తీవ్రత, రాత్రి సమయంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. చలి తీవ్రతతో చాలామందికి జలుబు, దగ్గు జ్వరం వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా సైనసైటీస్, సమస్య ఉన్నవారు తుమ్ములతో బాధపడటం ముక్కు మూసుకుపోవడం వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ప్రస్తుతం చలి చంపేస్తుండటంతో ప్రజలు సాయంత్రం అయిందంటే చాలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఉదయం వాకింగ్ జాగింగ్ చేసేవారు, పొలం పనులకు వెళ్లే కౌలు రైతులు, పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. శీతాకాలం ఆరంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో చలి ఏ స్థాయిలో ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పొగ మంచు వల్ల వాహనదారులు, పాద చారులు అనేక ఇబ్బందులకు గుం వుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల నుంచి 32 డిగ్రీల మధ్య, రాత్రులు 20 నుంచి 22 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. పగలు గాల్లో తేమశాతం 56 నుంచి 60 శాతం మధ్య నమోదవుతుంది. ఇదే వారం రోజుల క్రితం పరిస్థితిని పరిశీలిస్తే పగటిపూట గాలిలో తేమశాతం ఐదు వరకు తగ్గుతుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రాత్రులు గాలిలో తేమశాతం గరిష్టంగా 96 వరకు నమోదవుతుంది. వారం క్రితం పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటే రాత్రులు తేమ శాతం మధ్య వ్యత్యాసం 15 నుంచి 20 వరకు ఉంటుంది. దీంతో రాత్రులు చలి తీవ్రత పెరుగుతుంది. జనవరి చివరి వరకు చలిగాలుల ప్రభావం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ వై.అనూష, ఆచంట సిహెచ్‌సి సూపరింటెండెంట్



ప్రస్తుతం చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈ చలిగాలుల వల్ల పలు వ్యాధులతో బాధపడుతున్న వారు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. చలి వల్ల ఊపిరితిత్తులు కొంత అనారోగ్యానికి గురవుతాయి. చర్మం పగుళ్లుబారడం ఉంటుంది. చలికాలంలో చిన్నారులు, వృద్ధులకు సమస్యలు ఎక్కువగా ఉంటాయి. చలికాలంలో వీరికి రోగనిరోధక శక్తి లోపించి ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గుతుంది. దగ్గుతో కఫాన్ని బయటకు పంపించే శక్తి లేకపోవడం వల్ల ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ ఎక్కువవుతుంది. వృద్ధుల్లో ప్రత్యేకించి ఆర్థరైటిస్ ఉంటే ఎముకలు మరింత బిగిసిపోయే ప్రమాదం ఉంది. చిన్నారులకు చలిగాలులు తగలకుండా స్వెట్టర్లు, మెత్తని రంగులు వాడాలి. చలికాలంలో గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఉష్ణోగ్రతలు పడిపోయినప్పుడు రక్తనాళాలు మూసుకుపోయి, రక్తాన్ని శరీర భాగాలకు పంపిణీ చేయడం గుండెకు కష్టమవుతోంది. ఈ స్థితిలో గుండె రక్తాన్ని పంపిణీ చేయడానికి ఎక్కువగా శ్రమిస్తుంది. దీనివల్ల రక్తపోటు పెరుగుతుంది. ఆస్తమా వ్యాధిగ్రస్తులై ఉంటే చలిగాలి వల్ల శ్వాసనాళాలు కుచించుకుపోతాయి. అందువల్ల చలిగాలులు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఉపాధి హామీ చట్టం ముద్దు..2025 కొత్త బిల్లు వద్దు

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన బిల్లు ప్రతులు దహనం



చింతలపూడిలో..



ఆగిరిపల్లిలో..

ప్రజాశక్తి - చింతలపూడి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ముద్దు, 2025 కొత్త బిల్లు వద్దు అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం 2005ను రద్దు చేసి, 2025 పేరుతో 197 బిల్లు తెచ్చిందని, ఈ బిల్లు చట్టమైతే ఉపాధి హామీ చట్టం తల లేని మొండెంగా తయారవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్లో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన బిల్లు కాపీలను వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి పామాయిల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎందుకు రద్దు చేయబోతున్నారని, ఈ చట్టం వల్ల ఉపయోగం లేదని అంటున్నారా అని సూటిగా ప్రశ్నించారు. కొత్త బిల్లు ఉన్న ఉపాధిని లేకుండా చేస్తుందని, పనిదినాలు 125 రోజులకు పెంచుతున్నట్లు చెప్పి, 60 రోజులు పని నిషేధం విధించారని, వ్యవసాయ సీజన్‌లో రైతులకు కూలీల కొరత లేకుండా అని రైతుల ముసుగు తగిలించారని విమర్శించారు. ఉపాధి హామీ పనులు ఫిబ్రవరి 20 నుండి జూన్ 20 వరకు 75 శాతానికిపైగా జరుగుతాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాను పది శాతం నుంచి 40 శాతానికి పెంచడం ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయాలే కేంద్రం కుట్రలో భాగమేనన్నారు. ఇప్పటి వరకూ పంచాయతీల పాత్ర ప్రధానంగా ఉందని, ఇక నుంచి అన్ని అధికారాలు కేంద్రానికి ఉంటాయని, చివరకు సోషల్ ఆడిట్ కూడా మనుషులు కాకుండా టెక్నాలజీతో చేస్తామని ప్రభుత్వం చెబుతుందని, దీనివల్ల ఎవరికి ఉపయోగమని ప్రశ్నించారు. బిల్లులో అనేక అంశాలు ఉపాధి హామీ చట్టానికి వ్యతిరేకంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2025 బిల్లు వద్దే వద్దని, ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కూలీలు, పేదలు పామాయిల్ కార్మికులు ఆందోళనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంఘం జిల్లా కమిటీ సభ్యులు డి.సత్యనారాయణ, ఎం.శ్రీను, శ్రీనివాస్ వర్మ, మావుళ్ల సత్యనారాయణ, పామాయిల్ కార్మిక సంఘం నాయకులు హరీష్, లక్ష్మణ్, శ్రీనివాసు తదితరులు నాయకత్వం వహించారు.

జంగారెడ్డిగూడెం: 2025 పేరుతో తీసుకొచ్చిన కొత్త ఉపాధి బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్త బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొత్త బిల్లు కాపీలను బుధవారం దహనం చేశారు. ఈ కార్యక్రమానికి సంఘం మండల అధ్యక్షులు యాగంటి సీత అధ్యక్షత వహించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.జీవరత్నం మాట్లాడుతూ పేదల ఉపాధిని దెబ్బతీసేలా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండి పడ్డారు. పనులను నాలుగు విభాగాలుగా చేసి భారీ విలువైన పనులను చేర్చడం ద్వారా యంత్రాలు, కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చేలా మారుస్తున్నారని ఆరోపించారు. ద్రవ్యోల్బణం ఆధారంగా వేతనాలు పెంచే విధానాన్ని కూడా రద్దు చేశారని తెలిపారు. ఆధార్, బయోమెట్రిక్, ఎఐ, జిపిఎస్ వంటి సాంకేతిక నిబంధనలను చట్టబద్ధం చేయడం పేదలను ఉపాధి హామీ నుంచి తొలగించడానికే తప్ప మరొకటి కాదని విమర్శించారు. తక్షణం కొత్త బిల్లును ఉపసంహరించి, 2005 గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నేతలు ఎం.బాలరాజు, కె.సుబ్బారావు, ఎ.కాంతమ్మ, ఎం.కుమారి, జి.మరియమ్మ, ఎం.అశోక్, కుమార్, పెండెం బజార్, గుదే బాలయ్య, కె.భారతి, జుత్తిక గొల్ల పేరంటాలు, సింహాద్రి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: కేంద్రంలో మోడీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసేందుకు సిద్ధపడటం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సత్తు కోటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ ఉపాధి హామీ చట్టం ముద్దు.. 2025 కొత్త బిల్లు వద్దు అనే నినాదంతో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం డిప్యూటీ ఎంపిడిఒ బి.ఆనంద్‌బాబు, ఎఒ అబ్దుల్ సలాంకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ జహంగీర్ భాషా, రవీంద్ర, భాషా పాల్గొన్నారు.

పోలవరంలో జిల్లాలో 'పోలవరం'ను కలపాలి


తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు



బుట్టాయగూడెంలో...

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని చేర్చాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ధర్నాకు పోలోజు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మొడియం నాగమణి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం చేర్చకపోవడం బాధాకరమన్నారు. ఈ నెల 22వ తేదీన మన్యం బంద్ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కారం ముత్యాలరావు, కురసం భీవరాజు, కొర్ల రామిరెడ్డి, ఉడతా వెంకటేశ్వరరావు, చంద్రు బుల్లమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



పోలవరంలో...

పోలవరం : పోలవరం జిల్లా పునర్విభజనలో ఆదివాసీ ప్రాంతాలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. పోలవరం మండల గ్రామ ప్రజల తరపున తహశీల్దార్ బి.సాయిరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కారం భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గంలోని షెడ్యూల్ ప్రాంతాలు, నాన్ షెడ్యూల్ ప్రాంతాల్లో ఉన్న ఆదివాసీ గ్రామాలను కలపాలని డిమాండ్ చేశారు. పోలవరం జిల్లాలో పోలవరం లేకపోవడం నేతిబీరకాయలో నెయ్యి లేనట్టేనని విమర్శించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు పోలవరం నిర్వాసిత ప్రాంతాన్ని ఒక జిల్లాగా ప్రకటిస్తామని ఇచ్చిన హామీని ఉల్లంఘించారన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు పూర్తయ్యేందుకు నిర్వాసితులకు సమగ్ర పునరావాసం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల రంపచోడవరం నియోజకవర్గంలోని చింతూరు, ఎటపాక, కూనవరం, విఆర్.పురం, దేవిపట్నం మండలాలు, పోలవరం నియోజకవర్గంలోని పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు నిర్వాసితులవుతున్నారని తెలిపారు. వీరికి ఏలూరు జిల్లాలోని పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో పునరావాసం కల్పిస్తున్నారని చెప్పారు. పోలవరం ప్రాంతానికి, ఇక్కడి ఆదివాసీలకు న్యాయం చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలోని భూ సమస్యలు పరిష్కరించాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని కోరారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం తహశీల్దార్ బి.సాయిరాజుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తామ బాలరాజు, బొరగం భూ చంద్రరావు, మడివి చలపతిరావు, గోకూరి పాండవులు, సముద్రాల సాయికృష్ణ, మిడియం పండుదొర, ధర్ముల లక్ష్మి, కె.రాజు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డికి వినతి

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని, గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి, కమిషన్ సభ్యులు కాకి లక్ష్మిలకు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. మండలంలోని బోడిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల సందర్శనకు వచ్చిన వారికి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కారం భాస్కర్, బొరగం భూచంద్రరావులు సమస్యలు తెలిపారు. పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం మండలాల్లో ఉన్న ఆదివాసీ గ్రామాలను కలిపి జిల్లా చేయాలన్నారు. అన్ని హాస్టళ్లకు ఎఎన్ఎంలను నియమించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించాలన్నారు. ప్రతి నెలా మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి మాట్లాడుతూ హాస్టళ్లకు ఎఎన్ఎంలను నియమించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచేందుకు, గిరిజన విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ నివేదిక అందిస్తుందని తెలిపారు.



జీలుగుమిల్లిలో..

జెఎసి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

జీలుగుమిల్లి : రంపచోడవరం కేంద్రంగా పోలవరం పేరుతో ఏర్పడే జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని జెఎసి జిల్లా నాయకులు తెల్లం దుర్గారావు డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజన సంఘం, రైతు సంఘాలు, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం, పోలవరం నియోజకవర్గంలోని టి.నర్సాపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, గోపాలపురం మండలాల్లోని షెడ్యూల్ గ్రామాలను కలుపుతూ పోలవరం జిల్లా ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, సిహెచ్.కొండలరావు, కారం నాగదుర్గ, గుండె గంగరాజు, తెల్లం శంకరుడు, తదితరులు పాల్గొన్నారు.



టి.నరసాపురంలో...

5వ షెడ్యూల్ గిరిజన గ్రామాలను పోలవరం జిల్లాలో కలపాలి

టి.నరసాపురం : జిల్లాలోని 5వ షెడ్యూల్ గిరిజన గ్రామాలను కొత్తగా రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు చేయనున్న పోలవరం జిల్లాలో కలపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. ఆ మేరకు బుధవారం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ కొత్త జిల్లాల ఏర్పాటు విషయంలో పోలవరం నియోజకవర్గంలో ఐదో షెడ్యూల్ గ్రామాలన్నిటిని కలుపుతూ టి.నర్సాపురం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం మండలాల్లో ఉన్న ఏజెన్సీ గిరిజన గ్రామాలను కొత్తగా ఏర్పడే జిల్లాలో కలిపి పాలనాపరమైన సమస్యలు తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి, బరకడు కుమారి, వెంకటేశ్వరరావు, బరగడ వీరస్వామి, అనుములు మురళి, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీస్తాం

త్వరలో మినీ స్టేడియం నిర్మాణానికి టెండర్లు విడుదల

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి



మాట్లాడుతున్న శాప్ డైరెక్టర్ జగదీశ్వరి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంత క్రీడాకారుల సౌకర్యార్థం జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 2018 సంవత్సరంలో రూ.2.50 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన మినీ స్టేడియం నిర్మాణ దశలోనే నిలిచిపోవడంతో బుధవారం రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి స్పోర్ట్స్ అథారిటీ ఇంజినీర్లతో కలిసి ఐటిడిఎ పరిధిలోని మినీ స్టేడియం నిర్మాణ ప్రాంతంతో పాటు జీలుగుమిల్లి మినీ స్టేడియం నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. స్టేడియం నిర్మాణ ప్రాంతం మొండి గోడలతో అస్తవ్యస్తంగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మినీ స్టేడియం నిర్మాణం పూర్తి చేయడానికి నిధులు ఎంత మేరకు అవసరం ఉంటుందో ఇంజినీర్ల బృందంతో పర్యవేక్షించారు. అనంతరం నివేదికను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీకి పంపి స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభిండానికి రీ టెండర్లు పిలవనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలోనే స్టేడియాల నిర్మాణ పనులను ప్రారంభించి పనులను త్వరితగతిన పూర్తి చేసి క్రీడాకారుల సౌకర్యార్థం మినీ స్టేడియాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఆమెతో పాటు టెలికాం డైరెక్టర్ షేక్ సుభాని, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి హాజిజ్, ఇంజినీర్లు ప్రశాంత్, అనిల్, కూటమి నాయకులు ఉప్పాటి, రాజు, చిన్నబాబు, శ్రీను, పోతురాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పంగిడిగూడెం ల్యాండ్‌సీలింగ్ భూములు పేదలకు పంచాలి

భూస్వాముల అక్రమ సాగు వెంటనే నిలిపివేయాలి

ఎపి వ్యకాస ఆధ్వర్యాన ధర్నా



ధర్నా చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెంలోని ల్యాండ్ సీలింగ్ భూములను భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని, ఆ భూముల్లో అక్రమంగా సాగు చేస్తున్న భూస్వాములను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సంఘం మండల కమిటీ సభ్యులు ఎం.బాలరాజు అధ్యక్షత వహించారు. సిపిఎం నేత జి.సూర్యకిరణ్, సంఘం మండల అధ్యక్షురాలు యాగంటి సీత పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పంగిడిగూడెంలో సుమారు 250 ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూములను భూస్వాములు అక్రమంగా సాగు చేస్తున్నారన్నారు. ఇవి ల్యాండ్ సీలింగ్ భూములేనని కొవ్వూరు జిల్లా కోర్టు, రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు స్పష్టంగా తేల్చాయని గుర్తు చేశారు. భూస్వాములు వేసిన పిటిషన్లను కోర్టులు కొట్టివేశాయని పేర్కొన్నారు. అయినా సరే భూస్వాములు కొంతభూమిని అక్రమంగా సాగు చేస్తూ, పేదలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగం భూస్వాములకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంగిడిగూడెంలోని ల్యాండ్ సీలింగ్ భూములను చట్టబద్ధంగా పేదలకు పంచి, పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేసి రికార్డుల్లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పోరాట ఫలితంగా 222, 215/1 సర్వే నెంబర్లలో 20 ఎకరాల భూమిని ల్యాండ్ సీలింగ్ భూమిగా గుర్తించి రెవెన్యూ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. మిగిలిన భూములకు కూడా అదే విధంగా బోర్డులు ఏర్పాటు చేసి భూస్వాములను తొలగించి భూములను పేదలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆ భూములను స్వాధీనం చేసుకుని, భూమిలేని పేదలకు పంచుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంగిడిగూడెం భూపోరాట నాయకులు ఎం.అశోక్‌కుమార్, కె.సుబ్బారావు, జి.బాలయ్య, పి.బజార్, దిద్దే ప్రభాకర్‌రావు, ఎ.కాంతమ్మ, ఎం.కుమారి, జి.మరియమ్మ, సిఐటియు నాయకులు ఎస్‌కె.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు. మరో వంద మందికిపైగా వ్యవసాయ కార్మికులు హాజరయ్యారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ స్లీవ్‌జోజికి అందజేశారు.

పట్టాభి సీతారామయ్య ఆశయాలు ఆదర్శప్రాయం

గుండుగొలను గ్రామాభివృద్ధికి యుబిఐ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

భోగరాజు పట్టాభి సీతారామయ్య అభ్యుదయ సంఘం



విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి - భీమడోలు

స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య జన్మస్థలమైన గుండుగొలను గ్రామ అభివృద్ధికి అప్పట్లో హామీలు ఇచ్చిన ఆంధ్రాబ్యాంక్ కేంద్ర యాజమాన్యం, ప్రస్తుతం దానిని విలీనం చేసుకున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వాటిని అమలు చేయాలని గుండుగొలను గ్రామానికి చెందిన భోగరాజు పట్టాభి సీతారామయ్య అభ్యుదయ సంఘం అధ్యక్షులు, కార్యదర్శి మామిళ్ళపల్లి కాళీబాబు, బిఎస్‌వి.కోటేశ్వరరావు కోరారు. సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం కొనసాగుతున్న ఆనవాయితీలో భాగంగా భోగరాజు పట్టాభి సీతారామయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వింధ్యవాసిని చెరువుగట్టుపై వారు ఏర్పాటు చేసిన భోగరాజు పట్టాభి సీతారామయ్య విగ్రహానికి తగు రీతిలో సత్కారం, నివాళులర్పించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఆంధ్రా బ్యాంకు, ప్రస్తుతం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థానిక శాఖలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్నారు. వారు హామీలు అమలు విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తెస్తామని మరొకమారు హామీ ఇస్తున్నారు. గ్రామానికి చెందిన పలువురు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి ప్రముఖులు పాల్గొంటున్నారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఏ ఒక్కటీ అమలు కాలేదు. భోగరాజు సంస్మరణార్థం మ్యూజియం ఏర్పాటుకు వారి వారసులు ఆయన నివసించిన స్థలాన్ని, గృహాన్ని అందించేందుకు ముందుకొచ్చిన పట్టించుకునే నాథుడు లేకపోయాడు. ఈ క్రమంలో భోగరాజు పట్టాభి సీతారామయ్య వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధునిగా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న భోగరాజు పట్టాభి సీతారామయ్య, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు, పొదుపుని అలవాటు చేసేందుకు ఆంధ్ర బ్యాంకును స్థాపించారన్నారు. ఇదేవిధంగా ప్రజల బీమాకు ప్రత్యేకించిన ఆంధ్రాబ్యాంక్ లక్ష్మీ ఇన్సూరెన్స్ కంపెనీని ఏర్పాటు చేశారని తెలిపారు. ఆయన ఆశయాలు నేటి తరానికి సైతం ఆదర్శప్రాయమని చెప్పారు. కార్యక్రమంలో గుండుగొలను సొసైటీ మాజీ అధ్యక్షులు వగ్వాల భాస్కరరావు, గుండుగొలను యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌తో పాటు పలువురు కూటమికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో కార్తీక్ ప్రతిభ



కార్తీక్‌ను అభినందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో బుడిగిన రవి వీర వెంకట భవానీ కార్తీక్ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఈ పోటీల్లో మొత్తం ఆరు ఈవెంట్లలో పాల్గొని ఆరు గోల్డ్ మెడల్స్ సాధించి దేశానికీ, ప్రాంతానికీ గర్వకారణంగా నిలిచారు. ఇదే కాకుండా భారతదేశంలోనే అత్యధిక మెడల్స్ సాధించిన ఛాంపియన్‌గా కూడా కార్తీక్ రికార్డు సృష్టించారు. ఈ గొప్ప విజయాన్ని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు కార్తీక్‌ను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొత్త పట్టిసం గ్రామంలో శ్మశానవాటిక అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచి మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో పోలవరం మండల పరిషత్ నిధులతో శ్మశానవాటికలో బిల్డింగ్ నిర్మాణం, వాష్‌రూమ్ వసతి సహా ఇతర మౌలిక సదుపాయాల పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా ఎంపిపి ఫోరంకు అధ్యక్షులు, పోలవరం మండల పరిషత్ అధ్యక్షులు సుంకర వెంకటరెడ్డి మాట్లాడారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజలకు అవసరమైన సదుపాయాల అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస తరగతులను ఫలితాలను ఇస్తున్నాయని సంస్థ జిల్లా డైరెక్టర్ రామిశెట్టి గంగాధరరావు తెలిపారు. గుండుగొలను గ్రామంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో మానవత ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస తరగతులను నిర్వహించారు. రిసోర్స్ పర్సన్లుగా ఏలూరు యూనిట్ సభ్యులు దుర్గ, సుకన్యతో పాటు సదరు విభాగం జిల్లా డైరెక్టర్ ఉమామహేశ్వరావు విద్యార్థులకు పరీక్షలను ఎదుర్కొనాల్సిన విధానాల గురించి వివరించారు. దిశ, దశ నిర్దేశం చేశారు. అనంతరం పాఠశాల వారీగా పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న వారిలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు మానవత సంస్థ తరఫున ప్రోత్సాహకాలను అందించారు. పాఠశాలకు పొట్టి శ్రీరాములు చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా ప్రతినిధి గోనుగుంట రమణ శంకర్ పాల్గొన్నారు.

బడేటి చంటిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



ఎంఎల్ఎను కలిసిన టిడిపి మండల నాయకులు

టిడిపి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటిని ఆ పార్టీ మండల నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలుగు యువత మండల నాయకులు గుడెల్లి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ఎన్‌టి రామ్ పోలవరం నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన రవికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిని కలిసిన వారిలో పార్టీ మండలాధ్యక్షులు సుంకవల్లి సాయి, తెలుగు యువత గుడెల్లి లక్ష్మీనారాయణ, సోమసుందర్, ఎస్.మధు, బి.అనిల్, కిరణ్, సుబ్రహ్మణ్యం, పండు, కృష్ణ, అజయ్ తదితరులు ఉన్నారు.

ఎంఎల్ఎ బడేటికి ట్రైకార్ చైర్మన్ శుభాకాంక్షలు

పోలవరం :టిడిపి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటిని ఎపి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, టిడిపి బుట్టాయగూడెం మండలాధ్యక్షులు మొగపర్తి సోంబాబు, టిడిపి జీలుగుమిల్లి మండలాధ్యక్షులు సుంకవల్లి సాయి, పోలవరం మండలాధ్యక్షులు మంగిన కొండ, ఉండవల్లి సోమసుందరం, నునకాని రాంబాబు, పువ్వల వెంకట్రావు, కొణతాల ప్రసాద్, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు యడ్ల వినోద్, నీటి సంఘం అధ్యక్షులు పావడ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే కచ్చితత్వంతో చేయాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే (యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే2025) కచ్చితత్వంగా నిర్వహించాలని ఎంపిడిఒ గంజిరాజ్ మనోజ్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వెల్ఫేర్, మహిళా పోలీసు సిబ్బంది తో బుధవారం సమావేశం నిర్వహించారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో ప్రతి కుటుంబం సమగ్ర సమాచారాన్ని సేకరించాలని చేపట్టిన ఇంటింటి సర్వే దీని ద్వారా సరైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం, ఫ్యామిలీ బెనిఫిట్ కార్డులు జారీ చేయడం లక్ష్యమన్నారు.

ఆపన్నులకు సాయం అభినందనీయం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



సాయం అందిస్తున్న దాతలు

ఆపదలో ఉన్న వారికి ఆర్థికంగా చేయూతనందించడం ఎంతో అభినందనీయమని ఆగిరిపల్లి ఎస్ఐ సిలారపు షేబీర్ అన్నారు. ఆయన కార్యాలయంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ షేక్ బాజీ కుమార్తె ఆపరేషన్ నిమిత్తం యుటిఎఫ్ ఆధ్వర్యంలో వితరణగా అందించిన రూ.1,44,500 నగదు ఎస్ఐ ద్వారా బాజీకి అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఆగిరిపల్లి మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.రామచంద్రన్, కె.ఆశారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు జె.జ్ఞానసుందరం, జె.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు వ్యవసాయం పట్ల అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని మండల వ్యవసాయాధికారి ఉషారాణి తెలిపారు. మండల స్థాయిలో ఎంపిక చేసిన గుండుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 7, 8, 9వ తరగతి విద్యార్థులకు స్కూల్ హెల్-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత అధ్యక్షత వహించారు.

రేషన్ సకాలంలో పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రేషన్ సకాలంలో సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ బద్రునాయక్ చెప్పారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, వీఆర్‌ఒలతో బుధవారం సాయంత్రం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రేషన్ షాపులు ప్రతిరోజూ ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు తెరిచి ఉంచి, కార్డు కుటుంబ సభ్యులకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలన్నారు.

నేరాలు - ఘోరాలు

దొంగల ముఠా అరెస్ట్ : 12 బైకులు స్వాధీనం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 12 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ వెల్లడించారు. ప్రవీణ్‌కుమార్, శివకుమార్, సాయి వంశీలు ముఠాగా ఏర్పడి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడుతురన్నారు. వారిని పోలీసులు చాకచక్యంగా పట్టుకుని వారి వద్ద నుంచి 12 బైకులను స్వాధీనం చేసుకున్నారు. సాయిశంశీపై భీమడోలు పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు ఉన్నట్లు తెలిపారు.

నాటుసారా స్థావరంపై దాడి

చింతలపూడి :నాటుసారా స్థావరంపై దాడి చేసినట్లు చింతలపూడి ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం...మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామం అడవి ప్రాంతంలో నాటుసారా స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

ఐదుగురు బైండోవర్

ముసునూరు : నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఐదుగురు పాత నేరస్తులను తహశీల్దార్ డి.ప్రశాంతి ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ బైండోవర్ సంవత్సరం కాల పరిమితి ఉంటుందని, ఈ కాలంలో మళ్లీ ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానాతో పాటు ప్రభుత్వ పథకాలు రద్దవుతాయని తెలిపారు.

ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదం

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థుల్లో నిబిడీకృతమై ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు సహకరిస్తాయని ఎంఇఒ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. భీమడోలు హై స్కూల్ వేదికగా భీమడోలు మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.శేషవర్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ హాజరయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. 25 అంశాలపై ప్రదర్శనలను ఏర్పాటు చేశారు.

ముసునూరు :విద్యార్థుల్లో తమ ప్రతిభను, విశ్వసనీతను కనబరిచేందుకు సైన్స్ ఫెయిర్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపిడిఒ పి.ఏసుబాబు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో బుధవారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. మండల పరిధిలోని ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు ఈ సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొన్నారు. ఈ మండల స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనను ఎంపిడిఒ పి.ఏసుబాబు ప్రారంభించారు.

నూజివీడు టౌన్ :పట్టణ పరిధిలోని ఎస్ఆర్ఆర్ జెడ్‌పి బాలుర హై స్కూల్ ఆవరణలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన బుధవారం నిర్వహించారు. ఎంఇఒ జమలయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో పెరుగుతున్న సృజనాత్మక శక్తి అమోఘమైన ప్రయోగాలకు నాంది పలుకుతుందన్నారు. నేటి ప్రయోగాలు భావితరాలకు దిశానిర్దేశం చేస్తాయన్నారు. నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలన్నారు. పాఠశాల హెచ్ఎం డివిఎల్.పుష్పలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతలపూడి : చింతలపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. వెంకటాపురం విద్యార్థులు తయారు చేసిన మంకీ గన్‌ను ఎంఇఒ కిరణ్‌బాబు పరిశీలించారు.

పోలవరం : పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విజ్ఞానమేళా కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్య అతిథులుగా ఎంఇఒ-1 ఎల్.సత్యనారాయణ, ఎంఇఒ-2 వివిఎస్ఎన్.మూర్తి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ కె.లక్ష్మీకాంతం, ఎస్.భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెలలోపు పాపకు అరుదైన చికిత్స

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నెల వయస్సు కూడా పూర్తికాని చిన్నారికి అరుదైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడిన ఘనత త్రినేత్ర హాస్పిటల్‌కు దక్కింది. ఆసుపత్రి ఎమ్‌డి డాక్టర్ చావల నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం... నల్లజర్ల మండలం సుభద్రపాలెం గ్రామానికి చెందిన బిరుదుగడ్డ మౌనిక, మంగరాజు దంపతుల పాపను గత నెల 19వ తేదీన తీవ్ర శ్వాస ఇబ్బందులు, ఊపిరితిత్తుల సమస్యలతో విషమ స్థితిలో పిఐసియులో చేర్పించారు. పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉండటంతో 12 రోజుల పాటు వెంటిలేటర్ సహాయం అందించగా డాక్టర్ చావల నాగేంద్రబాబు, డాక్టర్ మేఘన సాయి పర్యవేక్షణలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది 24 గంటల పాటు ప్రత్యేక సంరక్షణతో చికిత్స అందించారు. దాదాపు నెలరోజుల పాటు పిఐసియులో చికిత్స పొందిన చిన్నారి ప్రస్తుతం పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్‌కు సిద్ధంగా ఉందని తెలిపారు. చికిత్స సమయంలో కుటుంబానికి ఆర్థిక భారం లేకుండా గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు ప్రభుత్వ సహకారంతో ఆర్థిక మద్దతు అందించారని, దీనివల్ల చిన్నారికి నిరంతర వైద్యం అందించగలిగామని డాక్టర్ నాగేంద్రబాబు తెలిపారు.

చినవెల్లమిల్లి సందర్శన

ప్రజాశక్తి - ఉంగుటూరు

వెల్లమిల్లి పంచాయతీ ఆవాస గ్రామాలైన చినవెల్లమిల్లి, చింతాయగూడెం, లంబాడీతండాలను చినవెల్లమిల్లి పంచాయతీగా ఎంపిక చేయాలని గ్రామస్తుల కోరిక మేరకు అధికారులు బుధవారం పర్యటించారు. డిప్యూటీ ఎంపిడిఒ గండి రమేష్‌బాబు ఆధ్వర్యంలో కార్యదర్శులు బివి.రవిచంద్రకుమార్, జివి.గిరిధర్, నీలం ప్రసాద్‌లను ప్రత్యేక గ్రామాలపై వినతులు, విజ్ఞాపనలు, వివరాలను సేకరించేందుకు జిల్లా ఉన్నతాధికారులు నియమించారు. ఈ క్రమంలో చినవెల్లమిల్లిలో గ్రామస్తులతో చర్చించారు. ఈ మూడు ఆవాస గ్రామాలు వెల్లమిల్లి పంచాయతీలో కలిసి ఉండటం వల్ల సమస్యలు, ప్రత్యేక గ్రామ పంచాయతీగా విభజిస్తే కలిగే ప్రయోజనాలపై వివరణాత్మకంగా ఆధారాలు, వివరాలను సేకరించారు. ప్రత్యేక ప్రొఫార్మాలో వివరాలను నమోదు చేసి జిల్లా యంత్రాంగానికి నివేదిస్తామని డిప్యూటీ ఎంపిడిఒ వెల్లడించారు. మాజీ సర్పంచి మెండంకల రత్తయ్య, గ్రామస్తులు అల్లంశెట్టి సాయి, తదితర ప్రజానీకం పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆటో డ్రైవర్లు రహదారి భద్రతా నియమాలు పాటించడంతో పాటు, మహిళల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ అన్నారు. ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఆటో డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఆటో నడిపేటప్పుడు వేగం వద్దు-ప్రాణం ముద్దు అనే అంశాన్ని గమనంలో ఉంచుకోవాలని, ఆటో డ్రైవర్లు మహిళ ప్రయాణికులను తమ కుటుంబ సభ్యులుగా భావించాలని, ప్రయాణికులు తమ వస్తువులను మర్చిపోతే డ్రైవర్లు సదరు వస్తువులను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని, నిశ్శబ్ద వస్తువులను ఆటోల్లో తరలించరాదని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆటో డ్రైవర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. ఈ మేరకు జీలుగుమిల్లి జనసేన కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.20 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు పి.రాము, అధికార ప్రతినిధి జి.రవికుమార్, కూటమి నాయకులు బుచ్చిరాజు, శ్రీను, తేజ, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు అర్బన్ ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం తలసేమియా, సికిల్‌సెల్ ఎనిమియా రోగుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ తలసేమియా, సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు మొత్తం 60 మంది వైద్య శిబిరానికి హాజరయ్యారని, చిన్నపిల్లల వైద్యులు వి.శ్రీదేవి రోగులను పరీక్షించి, 15 మందికి హెచ్‌పిఎల్‌సి పరీక్షలు నిర్వహించామన్నారు.

అంగన్‌వాడీలకు 5జి స్మార్ట్‌ఫోన్లు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కూటమి ప్రభుత్వానికి మరింత మంచిపేరు తీసుకొచ్చేవిధంగా అంగన్‌వాడీలు సమర్ధవంతంగా పని చేయాలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి సూచించారు. దానిలో భాగంగా వారు మరింత మెరుగైన పనితీరు చూపాలనే అభిలాషతోనే 5జి స్మార్ట్‌ఫోన్లు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన స్పష్టం చేశారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 5జి స్మార్ట్‌ఫోన్లను ఎంఎల్ఎ చంటి అంగన్‌వాడీ కార్యకర్తలకు అందించారు.

చింతలపూడి : అంగన్వాడీ టీచర్లు సమర్థవంతంగా పని చేసి మంచి పేరు తీసుకురావాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఆయన క్యాంపు కార్యాలయంలో జంగారెడ్డిగూడెం, కామవరపుకోట క్లస్టర్ పరిధిలో పని చేస్తున్న 298 మంది టీచర్లకు ఎంఎల్ఎ చేతులమీదుగా 5జి మొబైల్ ఫోన్లు అందించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండలంలో పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న 5జి స్మార్ట్ ఫోన్లను బర్రింకలపాడులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.

సమాజానికి మరో బాల్యమిత్రుడు పెన్షనర్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ భవన్‌లో బుధవారం పెన్షనర్స్ డే నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు పి.మాధవరావు, కార్యదర్శి పి.సత్యప్రసాద్‌రాజు, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యదర్శి వి.స్టాన్లీప్రభాకర్, అసోసియేషన్ ప్రెసిడెంట్ బిఎం.సింగ్‌లు మాట్లాడుతూ 1982లో ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, పెన్షనర్లకు గౌరవ మర్యాదల హామీ కోసం గొప్ప మైలురాయిగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. నాటి నుండి పెన్షనర్స్ డే డిసెంబర్ 17న నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం అనేకమంది పెన్షనర్స్‌ను సన్మానించారు. నూజివీడు ట్రెజరీ అధికారులు డిజె సంపత్‌రావు, చంద్రశేఖర్, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన సుజాత అంబేద్కర్, లక్ష్మణరావు, లక్ష్మయ్య, డాక్టర్ డి.కోటేశ్వరరావులను సన్మానించారు. అనంతరం ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు.

నిరుపేద కుటుంబాలకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెంలో స్థానిక గ్రీన్‌వే కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఇంటీరియర్స్ సంస్థ అధినేత వంకాయల పండు తన తండ్రి కీర్తిశేషులు రామారావు 16వ వర్ధంతి సందర్భంగా తొమ్మిది నిరుపేద కుటుంబాలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. కాపు సంక్షేమ సంఘం కె-9 ఆధ్వర్యంలో బుధవారం సుబ్బారెడ్డి కాలనీలోని ప్రతిభా స్కూల్ సమీపంలోని గ్రీన్‌వే కార్యాలయంలో 25 కిలోల చొప్పున మొత్తం 50 బియ్యం బ్యాగులను అందించారు. కుటుంబ సభ్యుల సంఖ్యను బట్టి ఏడాదికి సరిపడే విధంగా బియ్యం అందించారు. ఈ కార్యక్రమాన్ని గత నాలుగేళ్లుగా తండ్రి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నట్లు పండు తెలిపారు. భవిష్యత్తులో కనీసం వందమంది పేదలకు సహాయం చేయాలన్న లక్ష్యం ఉందన్నారు.

వికలాంగులకు సాయం

భీమడోలు :వికలాంగులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని గుండుగొలనుకు చెందిన శ్రీ విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షులు పేరిచర్ల శ్యామలరాజు అన్నారు. బుధవారం సాయంత్రం సేవా సమితి కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ ద్వారా ప్రతినెలా సహాయం పొందుతున్న 60 మంది వికలాంగులకు దాత కంకటాల సత్యనారాయణ సమకూర్చిన దుప్పట్లను అందించారు. ఇతర దాతలు సైదు సోమరాజు, మోరు హేమరాజు భోజనం ఏర్పాటు చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం గ్రామంలో కట్ట సత్యనారాయణ ఇంటి సమీపం నుంచి ప్రకాష్ ఇంటి వరకు రూ.ఐదు లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొయ్యలగూడెం మండలం ఎంపిపి గంజిమాల రామారావు, వైసిపి జిల్లా ప్రెసిడెంట్ మంతెన సోమరాజు పాల్గొని కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి కట్ట సత్యనారాయణతో పాటు ఎంపిటిసి సభ్యులు గంటా శ్రీను, చింత శ్రీదేవి, జానకిరామ్, ఘంటసాల సీనమ్మ, సాయి, షేక్ బాజీ హాజరయ్యారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

నూజివీడు టౌన్ :పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ట్రాఫిక్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రం చేసేందుకు ఇప్పటికే కంకణం కట్టుకున్నట్లు చెప్పారు. ప్రజల అవసరాలు, పెరిగిన వాహనాల దృష్ట్యా ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నాయకులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, అన్ని తరగతుల ప్రజలు సహకరించాలన్నారు.

పల్స్‌పోలియోపై శిక్షణ

ప్రజాశక్తి - పోలవరం

డిసెంబర్ 21న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో బుధవారం వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి వైద్యాధికారి డాక్టర్ కె.మురళీధర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు వయస్సు ఉన్న ప్రతి పిల్లవాడికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ముఖ్యంగా హైరిస్క్ ఏరియాల్లో పిల్లలను గుర్తించి ఒక్కరినీ వదలకుండా చుక్కలు వేయాల్సిన అవసరం ఉందన్నారు. వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఐదేళ్ల వయస్సు గల మొత్తం 2015 మంది పిల్లలు ఉన్నారని, డిసెంబర్ 21న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమంలో వంద శాతం లక్ష్యాన్ని సాధించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జె.ప్రసాద్, వైద్య సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది, సూపర్‌వైజర్లు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - చింతలపూడి

ఉపాధ్యాయులకు త్వరలో క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. ఒత్తిడిని తగ్గించడానికి మెన్ టీచర్స్‌కు క్రికెట్, ఉమెన్ టీచర్స్‌కు త్రో బాల్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పిపిపి విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం తగదని, తక్షణమే పిపిపి విధానాన్ని రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్, ఎఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ తొర్లపాటి రాజు అన్నారు. ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో చింతలపూడి నగరంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద విద్యార్థులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను కూటమి ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జిఒ నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు మౌలిక వసతులు కల్పించాలని, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజులు దోపిడీలను అరికట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి లోకాన్ని కలుపుకుని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సిద్ధు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణ పరిధిలోని శ్రీ రామకృష్ణ సేవాసమితిలో తిరివీధి లక్ష్మీరామారావు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం కూరగాయలను వితరణగా అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ సేవా సమితి ఛైర్మన్, రిటైర్డ్ విఆర్‌ఒ పంద్రంగి సత్యనారాయణమూర్తి, బ్రహ్మచారి భాస్కరన్ స్వామీజీ మాట్లాడుతూ ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్‌పర్సన్ తిరివీధి కృష్ణ దాతృత్వంతో కూరగాయలు, న్యూట్రిషన్ ఫుడ్ అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్ పర్సన్ తిరివీధి కృష్ణ, సభ్యులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నేడు ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపులో భాగంగా గురువారం కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయ సమస్యలపై యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ టీచర్లకు, 2010 ముందు అపాయింట్‌మెంట్ అయిన టీచర్లకు టెట్ రద్దు చేయాలని, ఆ మేరకు విద్యా హక్కు చట్టం సవరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని, ఎస్-ఎస్‌సి వంద రోజుల ప్రోగ్రాంలో విద్యార్థుల శారీరక, మానసిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆదివారాలు, సెలవు రోజుల్లో క్లాసులు రద్దు చేయాలని కోరారు.

21న అంతర్ జిల్లా కబడ్డీ సెలక్షన్స్

చింతలపూడి :ఈ నెల 21వ తేదీన జిల్లా సీనియర్ పురుషులు, మహిళల అంతర్ జిల్లా కబడ్డీ సెలక్షన్స్ ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు చింతలపూడి గవర్నమెం ట్ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులకు భోజనవసతి ఉందని తెలిపారు.